ఫార్మా కంపెనీ స్థాపన వద్దు : రైతులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 15:కాలుష్య కారక ఫార్మా కంపెనీ పెట్టవద్దంటూ దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.శేఖర్ ఇంటిని రైతులు ముట్టడించారు.గురువారం లగచర్లలో కాంగ్రెస్ నాయకుడి నివాసానికి వెళ్లిన రైతులు గంటపాటు ఆయనను ఇంట్లో నిర్బంధించి మాట్లాడారు. స్థానిక నేతగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిలతో మాట్లాడి ఫార్మా కంపెనీతో కలిగే నష్టాలపై వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరారు.

వాగ్దానాల అమలుకు కృషి

స్వాతంత్ర్య దిన వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం 78వ సాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్‌లోని కలెక్టరేట్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వాగ్దానాల అమలుతో ప్రజాసమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను స్పీకర్, నాయకులు, అధికారులు తిలకించారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఆవరణలో జెండావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రసగించారు.

సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ

బ్యాంకు లింకేజీ రుణాల కింద పట్టణ పరిధి మహిళా సంఘాలకు రూ.18.75కోట్లు, గ్రామీణ మహిళా సంఘాలకు రూ.52కోట్ల చెక్కులను స్పీకర్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి వంతున పారితోషికం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులకు క్రమవద్ధీకరణ పత్రాలు, ఉత్తమ సేవలు అందించిన 280మంది వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను స్పీకర్ అందజేశారు.



వికారాబాద్‌లో విద్యార్థుల విన్యాసం



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మంచి ప్రదర్శన కబరిచిన బాలబాలికలకు స్పీకర్ జ్ఞాపికలు అందజేశారు. కలెక్టరేట్ ఆవరణలో అభివృద్ధి, సంక్షేమంపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్యేలు, అధికారులు సందర్శించారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ తదితరులు



వికారాబాద్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- ప్రజాసమస్యల పరిష్కారంలో ముందున్న ప్రభుత్వం
- అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుదాం
- ప్రభుత్వానికి ప్రజలు తోడ్పాటునందించాలి

వికారాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు కృషిచేస్తోందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందున్నదన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయ ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవాలకు స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆడపడచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించొచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.54కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా చేశారని, వారికి రూ.56కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని ప్రభుత్వం మరింత పకడ్బందీగా అమలుచేస్తోందని, పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో పరిమితిని రూ.10లక్షలకు పెంచామన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 2,836మంది పేదలు చికిత్స పొందారన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ ఏడాది 4.5లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తోందని, ఇప్పటి వరకు జిల్లాలో 66,682 మంది మహిళలు గ్యాస్ సిలిండర్ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తోందని, దీని ద్వారా 1,25,721 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఇప్పటి వరకు రూ.9.8కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందజేసిందన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ కింద 1,09,269 మంది రైతులకు రూ.905కోట్ల రుణమాఫీ చేశామని స్పీకర్ చెప్పారు. జిల్లాలో వానకాలంలో ఇప్పటి వరకు 4.43లక్షల



గౌరవ వందనం స్వీకరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, జిల్లాకు 75,437 టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి వరకు 30,320టన్నుల ఎరువులు రైతులకు సరఫరా చేశామన్నారు. జిల్లాలో 162 మంది రైతులు 603ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారని, ఈ ఏడాది 830 ఎకరాల్లో రూ.2.4 కోట్లతో పండ్ల, పూల తోటల పెంపకం, కూరగాయల సాగును పెంచేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. యాసంగిలో 129 కొనుగోలు కేంద్రాల ద్వారా 53వేల టన్నుల వడ్లు కొని రైతులకు రూ.118.23కోట్లు చెల్లించామని చెప్పారు. జిల్లాలో 216 మహిళా సంఘాలకు రూ.5.57కోట్ల స్త్రీనిధి రుణాలు ఇచ్చారని, 1,447 పొదుపు సంఘాలకు రూ.138.69కోట్ల రుణాలు ఇచ్చారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 924 పాఠశాలల్లో పనులు చేపట్టామన్నారు. ఉపాధి హామీ కింద ఈ ఏడాదిలో 1,82,051 మంది కూలీలకు 57.61లక్షల పనిదినాలు కల్పించి రూ.137కోట్ల చెల్లించారన్నారు. ఈ ఏడాది జిల్లాలో రూ.45.69కోట్లతో 15 కొత్త 33కేవీ సబ్‌స్టేషన్ల నిర్మిస్తామన్నారు. రూ.9.74కోట్లతో 9 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును స్థిరీకరించి 9,200 ఎకరాలకు నీరందిచేలా ప్రతిపాదనలు రూపొందించారన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఇప్పటి వరకు 27.15లక్షల మొక్కలు నాటారన్నారు. టీజీ-ఐపాస్ ద్వారా రూ.45.57కోట్ల పెట్టుబడులతో 550 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారన్నారు. అనంతగిరి కొండల్లో పర్యాటకాభివృద్ధికి స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.110 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. అనంతగిరి, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు, బుగ్గ రామలింగేశ్వర ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల ద్వారా 6,974 పనులు మంజూరు కాగా రూ.277కోట్ల విలువైన 4,125 పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో రూ.270కోట్లతో రోడ్ల రెన్యూవల్ కింద 106 పనులు మంజూరయ్యాయని, రూ.150కోట్లతో డబుల్ లేన్ 7పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో రూ.96కోట్లతో కొత్త ఆర్వోబీ నిర్మిస్తున్నామన్నారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి, వెటర్నరీ కళాశాలలకు సమీకృత విద్యా భవన నిర్మాణాలు, 5 బ్రిడ్జిలు, ఇన్‌స్పెక్షన్ భవన నిర్మాణం చేపట్టేందుకు రూ.996.36కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, యూటీఎఫ్ఐడీసీ కింద రూ.202కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ సప్లయి, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు యంత్రాంగం కృషిచేస్తోందన్నారు. జిల్లాలో 73 కేసుల్లో 140కిలోల గంజాయి సీజ్ చేసి 148మందిని అరెస్టు చేశారన్నారు. అంతకు ముందు ప్రత్యేక వాహనంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డిలతో కలిసి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలనతో ప్రజలకు మేలు

జెండా ఆవిష్కరణానంతరం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపామని, ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉందని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జిల్లాను అభివృద్ధిలో ముందుంచేందుకు కృషిచేయాలని అధికారులను కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని 285స్వయం సహాయక సంఘాలకు రూ.25.7కోట్ల నిధులను ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివరావు, డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, డీసీపీ కోటిరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమరయోధులకు ఇళ్ల వద్దే సత్కారం

అనారోగ్య కారణాలతో కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి హాజరు కాలేని జిల్లాకు చెందిన ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను అధికారులు వారి ఇళ్ల వద్దే సత్కరించారు. కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాలకు చెందిన కుందూరు రాజేందర్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, జానాబాయిలను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద విద్యార్థినుల నృత్యం

రుణమాఫీ చివరి దశ పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 34,453 మందికి రూ.437.32కోట్లు మాఫీ
- రూ.2లక్షల వరకు పంట రుణం ఉన్న రైతులకు రుణ విముక్తి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)



కాంగ్రెస్ సర్కార్ ముందు ప్రకటించిన విధంగానే రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి విదితమే. ఈ మేరకు రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్న వారందరికీ రుణమాఫీ చేస్తామని వెల్లడించింది. ఆగస్టు 15లోగా అర్హులైన వారందరికీ రుణమాఫీ చేసే ప్రక్రియ పూర్తి చేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం మూడు దశల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు గత నెల 18వ తేదీన తొలి విడత రూ.లక్ష లోపు రైతు రుణాలను మాఫీ చేసింది. అలాగే గత నెల 30వ తేదీన రూ. లక్షన్నర లోపు రుణాలను మాఫీ చేసింది. ఇక చివరి విడతగా గురువారం రెండు లక్షల రూపాయల లోపు ఉన్న రుణాలన్నీ కూడా మాఫీ చేసింది. ఉమ్మడి జిల్లాలో అధికారులు గురువారం 34,453 మంది రైతులకు రూ. 437.32 కోట్ల రుణమాఫీ చేశారు. నేరుగా ఈ రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లోకి ప్రభు త్వం జమ చేసింది. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల లోపు పూర్తిగా రుణ మాఫీ చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటు న్నాయి. స్థానిక ఎన్నికల్లో దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించి భారీగా ఓట్లు సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది.

మూడో విడత రుణమాఫీ వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	మాఫీ(రూ.కోట్లు)
రంగారెడ్డి	15,226	185.40
వికారాబాద్	18,885	247.71
మేడ్చల్	342	4.21



గడిసింగాపూర్ రైతు వేదిక వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

పంటరుణాల మాఫీ చరిత్రాత్మకం

- జిల్లా రైతులకు రూ.905కోట్ల లబ్ధి
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 15: రైతులకు రెండు లక్షల పంటరుణాల మాఫీ చరిత్రాత్మకమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మూడో విడత 2లక్షల వరకు రుణమాఫీ సందర్భంగా గురువారం రైతులు సంబురాలు చేసుకున్నారు. గడిసింగాపూర్ రైతు వేదికలో జరిగిన సంబురాల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఒక రాష్ట్రంలో ఒకే సారి రూ.31వేల కోట్ల రుణమాఫీ రికార్డని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేతలు వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని తెలిపారు. మూడో విడత రెండు లక్షల వరకు ఉన్న అప్పులున్న రైతుల ఖాతాల్లో డబ్బు జమైందని తెలిపారు. మూడు విడతల్లో వందశాతం మాఫీ పూర్తయిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో రుణమాఫీ కింద రైతులకు రూ.905కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. ఒక్క పరిగి నియోజకవర్గానికి రూ.260కోట్ల మాఫీ జరిగిందన్నారు. త్వరలోనే ఎకరానికి 7,500 రైతుభరోసా ఇస్తామని తెలిపారు. వారం, పది రోజుల్లో పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండనుందని, అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డుకు, పూడూరులో నేవీ రాడార్ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల, రైల్వే లైన్ ఏర్పాటు చేసి తీరుతాం అన్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఏవో గోపాల్, ఏడీఏ లక్ష్మీకుమారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్, పరిగి మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చి చంపేస్తా

- దళిత మహిళకు ఎస్ఐ చిత్రహింసలు
- ఓ కేసు విషయంలో పలుమార్లు దాడి
- 3 నెలలుగా ఠాణాకు వచ్చిపోతున్న మహిళ
- బషీరాబాద్ ఎస్ఐ వేధిస్తున్నాడని ఆరోపణ



బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దీనంగా కూర్చున్న కళావతి

బషీరాబాద్, ఆగస్టు 15: కుమారుడి జాడ చెప్పాలని.. లేకుంటే తుపాకీతో కాల్చిచంపుతానని ఎస్ఐ బెదిరిస్తున్నాడని ఓ దళిత మహిళ వాపోయింది. మూడు నెలలుగా తనను స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలు పెడుతున్నాడని కన్నీటి పర్యంతమైంది. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో దీనంగా కూర్చున్న ఆమెను విలేకరులు పలకరించగా..గోడు వెల్లబోసుకుంది. బషీరాబాద్ మండలం నవల్గాకు చెందిన లోహడ నరేశ్(17) కాశీంపూర్ గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లి అదే గ్రామానికి చెందిన బాలిక(16)ను ప్రేమించాడు. ఇద్దరూ దళితులే. కొన్ని నెలలు ప్రేమించుకున్న వీరు మే 2న ఇళ్లలోంచి వెళ్లిపోయారు. తన కూతురిని నరేశ్ కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నరేశ్ తల్లి లోహడ కళావతిని ఎస్ఐ రమేశ్‌కుమార్ స్టేషన్‌కు పిలిపించాడు. కుమారుడి జాడ చెప్పాలంటూ ఎస్ఐ బూతులు తిట్టాడని కళావతి వాపోయింది. కాల్చి చంపి పేపర్‌లో ఆ వార్త వేయిస్తానని బెదిరించాడని తెలిపింది. నరేశ్ ఆచూకీ తెలిసే వరకు రోజూ స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశాడని చెప్పింది. దీంతో 3 నెలలుగా ఉదయం వచ్చి రాత్రి వరకూ ఠాణాలోనే కూర్చొని.. ఇంటికి పోతున్నానని వెల్లడించింది. కూలి పనులపై బతికే తాను రోజూ స్టేషన్‌కు వస్తుండటంతో పూట గడవడం కష్టంగా మారిందని వాపోయింది. ఎస్ఐ పలుమార్లు చేతులు, కాళ్లపై లాఠీతో కొట్టడంతో వాపు లొచ్చాయని కన్నీటి పర్యంతమైంది. ఈ విషయమై విలేకరులు ఎస్ఐ స్పందన కోరగా.. 'ఏమైనా రాసుకోండి' అని సమాధానం ఇచ్చారు.

వికారాబాద్‌లో భారీ వర్షం

వికారాబాద్, ఆగస్టు 15: వికారాబాద్‌లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చినుకులుగా మొదలైన వాన జోరుగా పడింది. వాన కోసం ఎదురు చూస్తున్న రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో సంతోషం వ్యక్తం చేశారు. నవాబుపేటలో 2.8 సెం.మీ, కోట్‌పల్లిలో 1.2 సెం.మీ వర్షం కురిసింది.

జెండా గౌరవాన్ని కాపాడాలి

కొడంగల్, ఆగస్టు 15: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయడంతో పాటు జాతీయ జెండా గౌరవాన్ని కూడా కాపాడాలని సీపీఐ కొడంగల్ నియోజకవర్గ నాయకులు ఇందనూర్ బషీర్, ఎండీ.మైమూద్, శ్యామ్‌సుందర్ తదితరులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పరిగి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

పరిగి, ఆగస్టు 15: అమెరికా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి 12 రోజుల పాటు అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. అమెరికా పర్యటన ముగించుకుని గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అంతకుముందే పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు భారీగా ప్రత్యేక వాహనాల్లో ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడ రామ్మోహన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతంపలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే పరిగి నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పూడూరు: విదేశాల పర్యటన ముగించుకుని వచ్చిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం పూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగరవేశారు.

వైభవంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారులు

శామీర్‌పేట, ఆగస్టు 15: శామీర్‌పేటలో శ్రీవీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సావాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయం నుంచి శ్రీవీరభద్రస్వామి ఆలయం వరకు విగ్రహాలను భక్తి శ్రద్ధలతో కేరళ వాయిద్యాలతో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున విగ్రహాలకు నీళ్లతో సాకలు పెట్టి పూజలు చేశారు. శ్రీభవానిరామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయం ప్రధానర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో 18 మంది పూజలు చేశారు. ముందుగా గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మాతృక, యోగిని వాస్తు, సర్వతోభద్ర, నవగ్రహపూజ, అగ్నిఉత్తారం, అగ్నిస్థాపనం, విగ్రహాల యంత్ర పూజ, జలాధివాసం, అధివాసాల పూజ, అర్చన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, శ్రీకట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం



మాధవరెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు, ఉపాధ్యాయులు

బషీరాబాద్, ఆగస్టు 15: బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డికి స్వగ్రామమైన జీవన్గిలో గురువారం స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో అత్యధికంగా నిధులు తీసుకువస్తానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు నెలనెలా వచ్చే గౌరవ వేతనాన్ని పాఠశాలలకు ఇస్తానని వెల్లడించారు. అనంతరం స్థానికుడు డిక్షనరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి సత్కారం



పర్వత్‌పల్లిలో బదిలీపై వెళ్లిన కార్యదర్శిని సన్మానిస్తున్న నర్సిరెడ్డి

బషీరాబాద్, ఆగస్టు 15: పర్వత్‌పల్లిలో ఇంత కాలం పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి సంజీవ్ కుమార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, రాంరెడ్డి, చంద్‌పాషా పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు దక్కిన పురస్కారం

జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందించారు. రంగారెడ్డి జిల్లాలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, స్వాతంత్ర్య సమరయోధులు, తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి

రంగారెడ్డి కలెక్టరేట్‌లో కళా రూపాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు





వికారాబాద్







మేడ్చల్



బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్లు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 15: ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడ శివారులో ఉన్న బంకులో పెట్రోల్ పోయించుకుంటే నీళ్లు వచ్చాయని ఓ వాహనదారుడు గురువారం రాత్రి హల్‌చల్ చేశాడు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామానికి చెందిన తిరుపతయ్య బైక్‌లో 3 వందల పెట్రోల్ పోయించుకున్నాడు. స్వగ్రామానికి వెళ్తుండగా కొంతదూరం వెళ్లాక బైక్ ఆగిపోయింది. ట్యాంక్ ఓపెన్ చేసి చూడగా పెట్రోల్‌లో నీళ్లు కలిసినట్లు అనుమానించాడు. మళ్లీ బంకు వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించి గొడవకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బైక్ నుంచి పెట్రోల్ తీశారు. పరీక్షలకు పంపనున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, ఆగస్టు 15: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చేయూతనందించి ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కోశాధికారి చైతన్యలు కోరారు. సీఐటీయూ అనుబంధ సంఘమైన భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులకు అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం కార్మికుల సమావేశం నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా ఇతర సంఘంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు. సంఘం అధ్యక్షుడు డి. యాదయ్య, కార్యదర్శి యాదయ్య తదితరులు ఉన్నారు.



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న మేడ్చల్ డీఆర్డీవో పీడీ సాంబశివరావు, మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునందన్‌స్వామి, డీఆర్వో హరిప్రియ

తాండూరులో 12 కొత్త పంచాయతీలు

- 173కు చేరిన జీపీల సంఖ్య
- పెద్దేముల్ మండలంలో అధిక జీపీలు
- గెజిట్ విడుదలతో పల్లెల్లో ఆనందం
- పాత వాటితో పాటే కొత్త పంచాయతీలకు ఎన్నికలు

తాండూరు, ఆగస్టు 15: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 12 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల సంఖ్య 173కు చేరింది. ఈ మేరకు కొత్త పంయచాతీలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గంలో ఎక్కువ గ్రామపంచాయతీలు ఉన్న మండలంగా పెద్దేముల్ ఉంది. వారం రోజుల్లో కొత్త గ్రామ పంచాయతీల్లో పరిపాలన ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పంపగా గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండడంతో ఏడాది సమయం పట్టింది. ప్రస్తుత గవర్నర్ బిల్లును ఆమోదించడంతో పాటు అసెంబ్లీలో తీర్మానించడంతో ఈ కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొత్తగా పెద్దేముల్ మండలంలో గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, పెద్దేముల్ తండా, రచ్చకడ్డ తండా, ధారుస్‌వాగు తండా, యాలాల మండలంలో బాగాయిపల్లి, మల్‌రెడ్డిపల్లి, పేర్కంపల్లి తండా, దేవులా తండా (దుబ్బల తండా), బషీరాబాద్ మండలంలో గంగ్వార్, ఏర్మానాయక్ తండా, మల్కన్‌గిరి గ్రామాలు గ్రామపంచాయతీలుగా మారాయి. ప్రసుత్తం తాండూరు మండలంలో 33, బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్త మూడు ఏర్పడగా 39 గ్రామ పంచాయతీలకు చేరుకున్నాయి. పెద్దేముల్ మండలంలో 374 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా ఐదు ఏర్పడటంతో 42 గ్రామ పంచాయతీలుయ్యాయి. యలాల మండలంలో 37 గ్రామ పంచాయతీలుండగా నాలుగు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో 41 గ్రామపంచాయతీలకు చేరాయి. కోట్‌పల్లి మండలంలో యథావిధిగా 18గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం 161 గ్రామ పంచాయతీలుండగా 12 పెరగటంతో గ్రామ పంచాయతీలు 173కి చేరాయి. పరిపాలన సౌలభ్యం కోసం 500 జనాభా ఉన్న తండాలు, పల్లెలను గత ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాడిన గ్రామపంచాయతీలకు పాత పంచాయతీలతో పాటే ఎన్నికల ప్రక్రియ చేపట్టే అవకాశముంది.

పీఆర్ ఎస్ఈ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

వికారాబాద్, ఆగస్టు 15: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కార్యాలయాన్ని గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్


వికారాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఎగరవేస్తున్న స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్


తాండూరు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


పరిగి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయం ముందు జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి

పూడూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఎగరవేస్తున్న ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి




వికారాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్


పరిగి: జెండాను ఎగరవేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


తాండూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


మేడ్చల్ టౌన్: జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జెండావిష్కరణ
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వికారాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, వార్డు కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, వివిధ రాజకీయ పార్టీల, కాలనీల అసోసియేషన్, యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. జెండా వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.


పరిగి: భృంగీస్కూల్‌లో జెండాకు గౌరవవందనం చేస్తున్న జడ్జి శిల్ప, మాజీ మంత్రి చంద్రశేఖర్


వికారాబాద్: ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు: త్రివర్ణ త్రినేత్రుడి అలంకరణలో భద్రేశ్వర స్వామి




పెద్దేముల్: ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి


కొడంగల్ రూరల్: అంబేడ్కర్ వేషధారణలో ఉన్న చిన్నారితో కడా ప్రత్యేక అధికారి, తహసీల్దార్


తాండూరు: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రెపరెపలాడుతున్న 100 ఫీట్ల ఎత్తైన జాతీయ జెండా


కొడంగల్: 400మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ


తాండూరు రూరల్: పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఏడీ ప్రవీణ్‌కుమార్

వికారాబాద్: మునిసిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్




కులకచర్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు


కీసర: రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సంస్కృతిక కార్యక్రమాలు


బషీరాబాద్: రెవెన్యూ కార్యాలయం ఎదుట జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ వెంకటేష్


మూడుచింతలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేసిన తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ తహసీల్దారు కార్యాలయంపై జాతీయజెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ డీఎస్ రజిని


దోమ: తహసీల్దార్ కార్యాలయం ముందు జాతీయ గీతం ఆలపిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మోమిన్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మనోహరచక్రవర్తి


ఘట్‌కేసర్: పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

కీసర రూరల్: నాగారం మున్సిపల్ కార్యాలయంపై జెండావిష్కరిస్తున్న చైర్మన్ కొకుంట్ల చంద్రారెడ్డి




ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగరవేస్తున్న చైర్ పర్సన్ ముల్లి పావని


బొంరాస్‌పేట్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ


కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంపై జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్


నవాబుపేట: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ జయరామ్


దారూరు: ధారూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ సాజిదా బేగం


శామీర్‌పేట: జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు, సిబ్బంది



పెద్దేముల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కందనెల్లి పాఠశాలలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కెనరాబ్యాంకు సిబ్బంది


మర్పల్లి: తహసీల్దార్ కార్యాలయం ముందు జెండాను ఎగరవేస్తున్న తహసీల్దార్ మునిరోద్దీన్


యాలాల: పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జెండా ఎగరవేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి

కార్మికులకు అండగా ప్రభుత్వం

వికారాబాద్, ఆగస్టు 15: కార్మికులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఎమెమ్మల్యే కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవంలో సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు, బూట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ మంజుల రమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు పరామర్శ

పెద్దేముల్, ఆగస్టు 15: బీఆర్‌ఎస్ కార్యకర్త పల్లె నాగేందర్‌ను మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్త పల్లె నాగేందర్ తండ్రి పల్లె నర్సయ్య వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మండలంలోని మంబాపూర్ గ్రామంలో నివాసముండే నాగేందర్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

బొంరాస్‌పేట్, ఆగస్టు 15: మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కావలి రవి, సీనియర్ అసిస్టెంట్ మమత, సర్వేయర్ దేవేందర్, ఆర్ఐ రవిచారి బదిలీ కావడంతో గురువారం తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా కొండన్న

కొడంగల్ రూరల్, ఆగస్టు 15: మండలంలోని హసేన్‌పూర్‌లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కొండన్న ఉత్తమ కార్యదర్శిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి చేతులమీదుగా గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

వ్యాసరచన పోటీల్లో పెద్దేముల్ విద్యార్థి ప్రతిభ

పెద్దేముల్, ఆగస్టు 15:జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని సుమారు 11 ఉన్నత పాఠశాలల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి మహమ్మద్ షాహెద్ మండలస్థాయిలో మొదటి స్థానం సాధించాడు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

తాండూరు, ఆగస్టు 15: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన తాండూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాండూరు పట్టణం విలియామూన్ చౌరస్తా నుంచి పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఉంది. ఈలైట్లు కొన్ని నెలలుగా సరిగ్గా వెలగకపోవడంతో మర్మత్తు చేసేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన షఫీ అనే కాంట్రాక్టర్‌కు మున్సిపల్ అధికారులు అప్పగించారు. కాంట్రాక్టర్ షఫీ నాలుగు రోజుల కిందట తన వద్ద పని చేసే కార్మికుల్లో ముగ్గురును తాండూరులో సెంట్రల్ లైటింగ్ మరమ్మతు పనులు చేసేందుకు పంపించారు. గురువారం ముగ్గురు కార్మికులు హైదరాబాద్ రోడ్డులోని సెంట్రల్ లైటింగ్ మరమ్మతు పనులు చేస్తుండగా బషీర్‌మియా తండా స్వాగతతోరణం సమీపం వరకు వెళ్లగా ప్రమాదవశాత్తు ఫారూఖ్ అనే యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని తాండూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం హైదరాబాద్‌కు రెఫర్ చేయగా అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతిచెందాడు. మతదేహాన్ని తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

దౌల్తాబాద్, ఆగస్టు 15: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్‌లో జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరఫస్లాబాద్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎరుకలి లక్ష్మి(36) ఐదు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌కు, అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరి తార ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉస్ఐ తెలిపారు.

ఆటో, కారు ఢీ

వికారాబాద్, ఆగస్టు 15: వికారాబాద్ బ్రిడ్జిపై గురువారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న ఆటో, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కానప్పటికీ వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటనతో కిలో మీటరు మేర ట్రాఫిక్ నిలిచివాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

క్రైం కార్నర్

మద్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 15: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓవ్యక్తిని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, అన్నోజిగూడ, సూర్యనగర్ కాలనికి చెందిన వి.వెంకటేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. కింగ్‌ఫిషర్ బీర్లు 32, ఆఫీసర్ చాయిస్ క్వాటర్లు 25, ఐబీ క్వాటర్లు తొమ్మిది, డౌన్‌టౌన్ క్వాటర్లు 12, ఎంసీ 90ఎంల్ 12, ఆఫీసర్ చాయిస్ 90ఎంఎల్ 12, రాయల్‌స్టాగ్ మూడు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

ధారూరు, ఆగస్టు 15: మండలంలోని అల్లీపూర్ గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ శివారులో చెట్టు కింద పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ధారూరుకు చెందిన నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వీరి వద్ద రూ.7,840 లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 15: తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్, సన్‌షైన్ అనెక్స్ కాలనీలో ఉంటున్న రాజ్‌కుమార్‌కార్ తన భార్య దీపాన్వితకార్‌తో కలిసి 14న మధ్యాహ్నం ఫీర్జాదీగూడలోని అద్దెఇంటికి వెళ్లి గురువారం తిరిగి వచ్చారు. ఇంటి గేటు తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలకి వెళ్లి చూడగా మేయిన్‌డోర్ సెంట్రల్‌లాక్ సిస్టంను ధ్వంసం చేసి ఉంది. బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందర పడి ఉండగా, బీరువాలోని ఎనిమిది తులాల బంగారు అభరణాలు, వెండి పల్లెం చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.